

5 లోపు ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తి చేయాలి

అనంతపురం సిటీ : పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసనమండలి ఓటర్లకు ఈనెల 5వ తేదీలోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తిచేయాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం ఉదయం అనంతపురం రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాల, రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అనంతపురం ఆర్‌డిఒ మధుసూదన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పోలింగ్ సిబ్బందికి వసతి సౌకర్యాలు కూడా సక్రమంగా ఉండేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసనమండలి ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఓటర్ స్లిప్పుల ప్రక్రియను పరిశీలించి, ఈనెల 5వ తేదీలోపు ఓటర్ స్లిప్పులను పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు.

మాట వింటే సరి..లేకపోతే కట్టడే..

ఇద్దరు ఉపాధ్యాయ నేతలకు షోకాజ్ నోటీసులు
నియోజకవర్గాల వారీగా సమావేశాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికార పార్టీకి అనుకూలంగా ఉంటే సరి.. లేకపోతే.. శాఖాపరమైన హెచ్చరికలు తప్పేలా కనిపించడం లేదు. మండలి ఎన్నికల్లో ప్రభావితం చూపే వారిపై అధికారపార్టీ దృష్టి సారిస్తోంది. ఏ చిన్న వంక దొరికినా అధికారిక హెచ్చరికలు తప్పడం లేదు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ మండలి ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో తమ సంఘం బలపరిచిన వ్యక్తి ప్రదర్శనలో పాల్గొన్నారని ఆ సంఘం ఉపాధ్యాయ నేతకు షోకాజ్ నోటీసులు అందాయి. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలు కావడంతో మద్దతుగా ఓటరు కూడా ఆయిన వారు పాల్గొనే వీలుంటుంది. కాని అంతకు మునుపు అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఒకరు ఆయన అధికారపార్టీ బలపరిచిన వ్యక్తికి మద్దతునివ్వాలని కోరినట్టు సమాచారం. ఆయన అంగీకరించలేదు. దీన్ని మనసులో పెట్టుకునే ఈ రకమైన చర్యలకు ఉపక్రమించారన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. సత్యసాయి జిల్లాలోనూ ఇదే రకంగా మరో నాయకుడికి షోకాజ్ నోటీసులు అందాయి. మరికొంత మందిపైనా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. మండలి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే రకమైన తంతు నడుస్తోంది. ప్రధానంగా ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి ప్రయివేటు స్కూళ్లలో అర్హత లేని వారిని కూడా ఓటర్లుగా చేర్చే అంశంలో మాట వినలేదన్న ఉద్దేశంతో అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌ను బదిలీ చేశారు. అటు తరువాత రీజినల్ జాయింట్ డైరెక్టరును ఇన్‌ఛార్జిగా పెట్టారు. తిరిగి ఆయన్ను బదిలీ చేసి తమకు అనుకూలంగా వ్యవహరించే జాయింట్ డైరెక్టరు ప్రతాప్‌రెడ్డిని ఆర్జేడీగా నియమించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాంను వేశారు. ఈ ఆర్జేడీ ఇటీవల అనంతపురం నగరానికి విచ్చేసి అధికార పార్టీ అభ్యర్థిని వెంటబెట్టుకుని నాయకులను ప్రలోభపెట్టే ప్రయత్నం చేయడం, దాన్ని విద్యార్థి, యువజన సంఘాలు అడ్డుకోవడం వివాదం రేపింది. ఈయన తీరుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం ఆ ఫిర్యాదుపై స్పందించి విచారణ చేపట్టింది. ఎన్నికలు అయిపోయే వరకు ఆయన ఈ ప్రాంతాల్లో పర్యటించడానికి వీల్లేకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా చేసుకున్న అధికారపార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యతలను ఎమ్మెల్యేలకు అప్పగించారు. ఎమ్మెల్యేలు అన్ని నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడంపైనా దృష్టి సారిస్తున్నారు. ఓటర్లను ప్రభావితం చేయగలిగే స్థానిక నేతలను గుర్తించి వారిని తమ దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారపార్టీ నేతలు మాత్రం ఎన్నికల నిబంధనలను సైతం పాటించకుండా నేరుగా ప్రచారాలు చేస్తున్నారు. పాఠశాల సమయాల్లో ప్రచారాలు చేయడానికి వీల్లేదని చెబుతున్నా మంత్రి ఉష శ్రీచరణ్ నేరుగా కంబదూరు మండలంలో ప్రచారం చేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధులే ఈ రకంగా వ్యవహరిస్తుండటంతో అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ ఇటువంటి చర్యలు పెరుగుతున్నాయని ఇతర అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల సంఘం పర్యవేక్షించి అక్రమాలను అరికట్టాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అనంతపురం కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు అధికార పార్టీ నాయకులు, కొందరు అధికారులు సిద్ధమయ్యారని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. శుక్రవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పాత్రికేయులతో మాట్లాడారు. జిల్లా మంత్రి మొదలు విద్యాశాఖ అధికారుల వరకు బహిరంగంగా ఎన్నికల నిబంధనలను ధిక్కరిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులను ప్రభావితం చేసేందుకు అధికారుల ద్వారా సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులతో సమావేశం జరిపారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌పై ఉపాధ్యాయుల, ఉద్యోగులకు అవగాహన కల్పించే పేరుతో సమావేశాలు జరిపి వారిని ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. జిల్లా మంత్రి ఉషశ్రీ చరణ్ కంబదూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం చేశారని తెలిపారు. పాఠశాల సమయంలో ప్రచారం చేయరాదని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి ప్రతిపక్షాల ప్రచారాన్ని అడ్డుకుంటూ, మరో వైపు అధికార పార్టీ నేతలను యథేచ్ఛగా అనుమతించడం పట్ల ఎన్నికల కమిషన్ మౌనంగా ఉందని విమర్శించారు. ఎన్నికలు జరిగే లోపు అనేక అక్రమ పద్ధతులకు అధికార పార్టీ పాల్పడుతుందన్నారు. తక్షణమే ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని అక్రమాలు అరికట్టందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆర్‌ఐఒకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో మంచి మార్కులు వేస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆర్‌ఐఒ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ జరుగుతున్న నేపథ్యంలో ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి వేల రూపాయలు వసూలు చేయడానికి శ్రీకారం చుట్టాయని తెలిపారు. ఇప్పటికే అనంతపురం జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులతో ప్రాక్టికల్స్ మార్కుల కోసం, రికార్డుల కోసం వేల రూపాయలు వసూలు చేసుకున్నారని విమర్శించారు. సమస్యపై విద్యార్థుల తల్లిదండ్రులే అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా చలనం లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. కళాశాలకు ఫీజులు చెల్లించలేదనే నెపంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పిఆర్‌కె కళాశాల యాజమాన్యం కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న కీర్తి అనే విద్యార్థిని ఫీజుల కోసం మానసికంగా ఒత్తిడికి గురి చేశారని తెలిపారు. పరిశీలించి పిఆర్‌కె కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. స్పందించిన ఆర్‌ఐఒ అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మణిదీప్, రాజేష్, రజిత, శివమ్మ, అరుణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రోషన్‌సాబ్‌కు సన్మానం

శింగనమల : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పర్యవేక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న డాక్టర్ రోషన్ సాబ్‌ను శుక్రవారం స్థానిక హెల్త్ సెంటర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జనరల్ సర్జన్ డాక్టర్ రమణానాయక్ మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించడంలో దేవుడిచ్చిన వరం అన్నారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రజల మధ్య ఉంటూ సేవలు అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న వైద్యులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి పెట్టారు..ఇల్లు కట్టించారు..!

ఆ పార్టీ.. ఈ పార్టీ అని కాదు.. ఏ పార్టీ అయినా ఎన్నికల సమయంలో సొంతి ఇల్లు లేని వారందరికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీలపై హామీలు ఇస్తారు. అధికారంలోకి వచ్చాక దాని గురించి మరిచిపోవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వానికి తగ్గట్లు అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇళ్ల నిర్మాణల కోసం చేసిన అప్పులకు లబ్ధిదారులు వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితి ఇది.


అధికారుల నిర్లక్ష్యం..
మంజూరు కాని బిల్లులు
వడ్డీలు కడుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామంలో సొంతిల్లు లేని కెఎస్. లతకు డిసెంబర్ 2వ తేది 2020 సంవత్సరంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇల్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణాన్ని బట్టి బిల్లులు మంజూరు చేస్తామన్నారు. వారి వద్ద డబ్బులు లేక పోవడంతో ఇంటి నిర్మాణం వెంటనే చేపట్టలేదు. దీంతో గ్రామ స్థాయిలో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ పనులు పూర్తి అయిన వెంటనే బిల్లులు మంజూరు చేయిస్తామని, అధైర్య పడకుండా వెంటనే పనులు ప్రారంభించాలని వారికి భరోసా కల్పించారు. అధికారి మాటలు నమ్మిన లత, భర్త శ్రీనివాసరెడ్డిలు అప్పుచేసి వారు నివాసముంటున్న గుడిసె స్థలంలో పునాది వేశారు. దానికి సంబంధించిన బిల్లు కోసం సచివాలయం, గృహ నిర్మాణ శాఖ కార్యలయం చుట్టూ తిరిగారు. వారు అక్కడికి వచ్చి జియో ట్యాగ్ చేసి గోడలు కట్టాలని, పునాదికి సంబంధించి బిల్లు మరో 10 రోజుల్లో మంజూరు అవుతుందని చెప్పారు. దీనిని నమ్మిన వారు మరో చోట అప్పు చేసి గోడల నిర్మాణం చేపట్టారు. మళ్లీ బిల్లు కోసం అధికారుల వద్దకు వెళ్లారు. అధికారులు వచ్చి జియో ట్యాగ్ చేసి రెండు బిల్లులూ మంజూరు అవుతాయని చెప్పి వెళ్లి పోయారు. సంవత్సరాలు గడుస్తున్నా వారికి రావాల్సిన బిల్లులు మాత్రం ఇప్పటికీ మంజూరు కాలేదు. నాటి నుంచి నేటి వరకు గ్రామ సచివాలయం నుంచి కలెక్టర్ కార్యలయం వరకు బిల్లులు మంజూరు చేయాలని అధికారులకు వినతులు ఇచ్చి మరీ కోరుతున్నారు. ఇదే విధంగానే అనంతపురం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకుని బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక పోతున్నామని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు వాపోతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

గ్రామ స్థాయిలో ఇంజినీరింగ్, గృహ నిర్మాణ శాఖ అధికారుల మధ్య ఉన్న సమన్వయం లోపం వల్ల ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిన భాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై ఉంది. అయితే ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ అధికారులు చేసుకుంటారని వారు పట్టించుకోవడం లేదు. ఇలా ఎవరికి వారే.. యమునా తీరే.. అన్న చందంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.



చౌళూరు గ్రామంలో బిల్లులు మంజూరుకాని జగనన్న ఇల్లు

బిల్లుల కోసం ఏడాదిగా తిరుగుతున్నాం..



ప్రభుత్వం తమకు 2020లో ఇళ్లు మంజూరు చేసింది. వెంటనే ఇల్లు కట్టుకోడానికి తమ వద్ద డబ్బులు లేక పోవడంతో నిర్మాణం చేపట్టలేదు. గ్రామంలో సచివాలయంలో పనిచేసే అధికారికి తమ వద్దకు వచ్చి బిల్లులు మంజూరు అవుతాయని, తాము దగ్గరుండి మంజూరు చేయిస్తామని ధైర్యం చెప్పారు. ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టడంతో పాటు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాం. గోడల వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. దానికి సంబంధించి బిల్లులు ఇప్పటికీ మంజూరు కాలేదు. దీంతో సచివాలయంలో ఫిర్యాదు చేశాం. గృహ నిర్మాణ శాఖ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు న్యాయం చేయాలని పలుమార్లు విన్నవించుకున్నాం. చివరకు ఆధార్ నెంబరు మిస్ మ్యాచ్ అయిందని అంటున్నారు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు

- కెఎస్.లత, లబ్ధిదారు, చౌళూరు గ్రామం

ఇప్పటికే రెండు బిల్లులు మంజూరయ్యాయి

హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామంలో లబ్ధిదారులు లత నిర్మాణం చేసిన ఇంటి నిర్మాణానికి సంబంధించి రెండు బిల్లులు మంజూరు చేశాం. 2021 ఆగస్టు 12వ తేది పునాదికి సంబంధించి రూ.44.200, గత ఏడాది జూన్ 28న గోడలకు సంబంధించి రూ.63,200 మంజూరు చేశాం. అయితే ఆ డబ్బులు లత ఖాతాకు చేరలేదు. పరిశీలన చేసి వెంటనే వారి ఖాతాకు జమ అయ్యే విధంగా చర్యలు చేపడతాం.

- శివకుమార్ నాయక్, హౌసింగ్ డీఈఈ

ఆర్‌ఒబి వద్ద గడ్డర్ల లాంచింగ్ షురూ..

పనులు పరిశీలించిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
తొలి రోజు ఐదు స్టీల్ గడ్డర్లు అమరిక
మే తొలి వారంలో పనులు పూర్తి

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం టవర్‌క్లాక్ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో కీలకమైన గడ్డర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. రైల్వే అధికారుల నుంచి అనుమతులు రావడంతో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3.30 గంటల వరకు స్టీల్ గడ్డర్లను ఏర్పాటు చేశారు. తొలి రోజు ఐదు గడ్డర్లను అమర్చగా శనివారం కూడా మరో ఐదు గడ్డర్లను అమర్చనున్నారు. ఈ పనులను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పర్యవేక్షించారు. రైల్వే అధికారులు రమేష్, రవిబాబు, రమణయ్య, ఎన్‌హెచ్ అధికారులు గుప్తా, ధనలక్ష్మి, ఎస్‌ఆర్‌సి ప్రతినిధులు అవినాష్, హర్షతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఐదు స్టీల్ గడ్డర్లను ఏర్పాటు చేసే వరకు అక్కడే ఉండి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ.. అర్బన్ లింక్ వైడనింగ్ ప్రాజెక్ట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఆర్‌ఒబి వద్ద కీలకమైన గడ్డర్ల లాంచింగ్ ప్రారంభమైందన్నారు. నగరంలో జాతీయ రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని చెప్పారు. రైల్వే, ఎన్‌హెచ్ అధికారులు, నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికార యంత్రాంగంతో పాటు ఎస్‌ఆర్‌సి ఏజెన్సీ ప్రతినిధుల కృషి వల్ల పనులు ఇంత త్వరగా జరుగుతున్నాయని తెలిపారు. ఎక్కడా లేని విధంగా 9.1 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఏప్రిల్ నెలాఖరు లేదా మే మొదటి వారం నాటికి ఆర్‌ఒబి పనులు పూర్తవుతాయన్నారు. ఆ తర్వాత బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి ఇస్తామని తెలిపారు. జూన్ నాటికి అండర్ పాస్ పనులు కూడా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్డర్ల లాంచింగ్ విషయంలో రైల్వే అధికారుల సహకారం ఎంతో ఉందని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. 55 ఏళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరిగిందన్నారు. కానీ ఇప్పుడు జనాభా పెరిగిపోయిందన్నారు. సుమారు 5 లక్షల జనాభా అనంతపురంలో ఉందన్నారు. కనెక్టివిటీ పెరగడంతో వాహన రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయని చెప్పారు. అందుకోసమే డబుల్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. బ్రిడ్జి పనులు పూర్తికాగానే రాకపోకలకు అనుమతి ఇస్తామన్నారు. ప్రజల సహకారం కూడా ఉండడంతోనే పనులు అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తవుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే అనంత వెంట మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం తదితరులు

పప్పుశనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాపు చేసిన ఈ కేంద్రంలో సొసైటీ వారు పప్పుశెనగ క్వింటాకు రూ.5,335 చొప్పున మద్దతు ధర కల్పించనున్నట్లు తెలిపారు. మండలంలో 16,650 ఎకరాల్లో పప్పుశెనగ సాగు చేసినట్లు రికార్డుల్లో ఉందన్నారు. వారందరూ పంటను విక్రయించుకునేందుకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు చంగల్‌రాయుడు, మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయని, విహెచ్‌ఎ రవితేజ, సొసైటీ అధికారి గోవిందు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలి

బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ కుషుబూ కొఠారి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పదో తరగతి ఉత్తీర్ణతపై టెన్త్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని కోరారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పదో తరగతి పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలా.. అన్న అంశంపై క్రియేటర్ కృష్ణ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. తర్వాత అనంతరం విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు (అట్టలు) అందజేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎబిసిడబ్ల్యుఒ మస్తాన్, ప్రభుత్వ టీచర్లు, స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయిన విద్యార్థులకు న్యాయం చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌కెయు నిర్వహించిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఎస్‌కెయు పరిపాలన భవనం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. అనంతరం రెక్టార్ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌కెయు పరిధిలో ఇటీవల విడుదల చేసిన నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో అనంతపురం జిల్లావ్యాప్తంగా 10,288 మంది విద్యార్థులు ఫెయిలయ్యారన్నారు. పరీక్షల విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షలు తప్పారని ఆరోపించారు. కావున ఫెయిలైన విద్యార్థులకు ఉచితంగా రీవాల్యుయేషన్ చేసి మళ్లీ ఫలితాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన రెక్టార్ ఆయాసమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అశోక్ కుమార్, సంజీవ్ కుమార్, సందీప్‌రెడ్డి, అష్రాఫ్ వల్లి, అనిల్, మధురెడ్డి, బాధిత విద్యార్థులు మస్తాన్‌వలి, విజయ్, చందు, ప్రమీల, సౌమ్య, సుకన్య, సాయి చరణ్, ఫయాజ్ ఖాన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజా గొంతుకలైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



ఓటర్లను అభ్యర్థిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజా గొంతుకలైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రిలో ఓటర్లను కలుసుకుని పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా, కార్మిక సమస్యలపై చట్ట సభల్లో ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసన మండలికి పంపాలని కోరారు. ప్రధానంగా మన ప్రాంతంలో నిరుద్యోగ, ఉద్యోగ, కార్మిక సమస్యలపై శాసన మండలిలో ప్రజాగళం వినిపించాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ముఖ్యంగా పోతుల నాగరాజు తన ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తినే వదులుకుని నిరుద్యోగ, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తున్నారని వివరించారు. కావున పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, తిమ్మప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలంటూ సిపిఎం, రైతుసంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఉరవకొండలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు, జూనియర్, డిగ్రీ కళాశాలలతోపాటు ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో ఓటర్లను కలుసుకుని అభ్యర్థించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నర్సింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, జిల్లా రైతుసంఘం నాయకులు జ్ఞానమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ, మండల నాయకులు సింహాద్రినాయక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

శింగనమల : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా గొంతుకలు మండలిలో వినిపించాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను తప్పనిసరిగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి 32 సంవత్సరాలుగా అనేక ఉద్యమాల్లో పాల్గొంటున్న పోతుల నాగరాజుకు ఓటేసి గెలిపించాలన్నారు. అంతేగాకుండా విద్యార్థి నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా, వెనుకబడిన కులాల ఐక్యవేదిక కన్వీనర్‌గా, మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహనిగా ప్రజలకు ఎన్నోసేవలు చేశారన్నారు. ఈ రైతుసంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సూర్యప్రకాష్, అధ్యక్షులు గంగాధర్, రమణారెడ్డి, ధనాంజనేయులు, మునెప్ప, కేశప్ప, కృష్ణమూర్తి, నల్లప్ప, కుమార, నాగేంద్ర, శంకర, నరసింహా, రత్నక్క, చంద, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, నాగేంద్ర, పెద్దన్న, శివమల్లయ్య, నరసింహా, ప్రభాస్, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు పరమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం నాయకు రాళ్లు పాల్గొన్నారు.



ఓటరుకు కరపత్రం అందజేస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, నాయకులు

పుట్లూరు : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

రాయదుర్గం : గుమ్మగట్ట మండలంలోని కళాశాలలు, పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, నాయకులు లోకేష్, పాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేయండి

కాంట్రాక్ట్ ఉద్యోగుల జెఏసి రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మార్చి 13న నిర్వహిస్తున్న శాసన మండలి పట్టభద్రులు, ఉపాధ్యాయుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్స్, వర్కర్స్ జెఏసి రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నూర్ మహమ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, ఎం.నాగమణితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలువలకు కట్టుబడిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్స్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుందామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల పెంపు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు, లీవ్‌లు, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్‌లు, ఎక్స్‌గ్రేషియా సాధించుకోవటం, మెడికల్ అండ్ హెల్త్, విద్య, సోషల్‌వెల్ఫేర్ తదితర విభాగాలలో రెగ్యులర్ పోస్టుల సాధనకై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తోడ్పాటునందించారని తెలిపారు. కావున కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, లెక్చరర్‌లు, కార్మికులు పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల జెఏసి రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్

నేరాలు ఘోరాలు

యువకుడు అనుమానాస్పద మృతి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని సురసింగనపల్లిలో గురువారం రాత్రి ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. గుత్తి ఆర్ఎస్ లోని బండిమోటు వీధిలో నివాసం ఉండే రైల్వే లోకో పైలట్ ఆదినారాయణ కుమారుడు మంజునాథ్ (24) ఎస్ఎస్ పల్లి లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్దకు వెళ్లాడు. అయితే ఉన్నఫలంగా మృతిచెందాడు. గుండెపోటుతో మృతి చెందాడా.. ఇతర కారణాలున్నాయా.. అని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



మృతిచెందిన మంజునాథ్

వంట గ్యాస్ లీక్.. ఇద్దరికి గాయాలు

రాయదుర్గం : పట్టణంలోని బుడెన్‌సాబ్ తోట వద్ద ఉన్న ఓ ఇంటిలో వంట గ్యాస్ పైప్‌లైన్ లీకై మంటలు చెలరేగి తండ్రీకూతుళ్లు గాయపడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... శ్రీనివాసులు కూతురు దీక్షిత వంట చేసేందుకు ప్రయత్నించింది. అయితే అప్పటికే గ్యాస్‌పైప్ లీకు కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దీక్షిత తీవ్రంగా గాయపడింది. కాపాడబోయిన తండ్రి శ్రీనివాసులు కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తరలించారు. దీక్షితకు 64 శాతం ఒళ్లు కాలినట్లు వైద్యులు తెలిపారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి

ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి

అనంతపురం సిటీ : మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బిఎన్.శ్రీదేవి సూచించారు. శుక్రవారం స్థానిక రుద్రంపేట పంచాయతీలోని పంతులు కాలనీ అంగన్వాడీకేంద్రం-1లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తప్పనిసరిగా తమ పిల్లలను చదివించాలన్నారు. అదేవిధంగా స్వశక్తితో ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో సిడిపిఒ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ జయశ్రీ, వన్‌షాప్ సెంటర్ శాంతమణి, డిసిపిఒ సుబ్రమణ్యం, డి.వి యాక్టు కౌన్సిలర్ ఉమా, జిల్లా కోఆర్డినేటర్ నాగేంద్ర, అంగన్వాడీ టీచర్ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యమే ఆర్టీసీ ధ్యేయం

ఉరవకొండ : ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతోందని ఉరవకొండ డిపో మేనేజర్ బాలాజీదయాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరవకొండ పట్టణ,. పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఈనెల 6న శ్రీశైలంలో జరిగే భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఉత్సవాలకు ఉరవకొండ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ బస్ టికెట్‌తో పాటు ఆలయంలోని దేవుని దర్శనానికి వెళ్లే టికెట్లను కూడా ఆన్‌లైన్‌లో ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 6వ తేదీ సోమవారం ఉరవకొండ డిపో నుంచి తిరువన్నమలై (గిరి ప్రదక్షిణం)కు వెళ్లే వారి సౌకర్యార్థం సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామన్నారు. గిరి ప్రదక్షిణ పోయి రావడానికి ఉరవకొండ నుంచి పెద్దలకు రూ.1,570, చిన్నపిల్లలకు రూ.800 టికెట్ల ధరలు కేటాయించామన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏమైనా సందేహాలు ఉంటే డిపో మేనేజర్ సెల్..99592 25861, సూపరింటెండెంట్ సెల్..73828 61075 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బండ్లపల్లి పంచాయతీ కార్యాలయం తనిఖీ

నార్పల : మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డివిజినల్ పంచాయతీ అధికారిణి సుమన జయంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యాలయంలోని రిజిస్టర్లు, వివిధ పద్దుల కింద వచ్చిన నిధుల కేటాయింపు తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ సమావేశాలు, గ్రామసభలను నిర్దేశించిన కాలవ్యవధిలోనే నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గ్రామ పంచాయతీలో చేపట్టే, చేపట్టాల్సిన పనుల వివరాలను సభ్యులు, ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి జి.లక్ష్మీనరసింహా, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ కుళ్లాయప్ప, సచివాలయ సిబ్బంది శశిధర్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

గుత్తి : చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని శ్రీ సాయి క్యాంపస్ సీఈవో ఎ.శ్రీరాములు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉన్నత చదువులు చదివి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జాన్ సునీల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

అనంతపురం సిటీ : అనంతపురం రూరల్ మండలం తపోవనంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 8వ తరగతి విద్యార్థులు బైజ్యూస్ ట్యాబులను వినియోగిస్తున్నారా? లేదా? అని ఆరాతీశారు. అనంతరం విద్యార్థుల నోట్‌బుక్, టీచర్ల డైరీలు, రికార్డులను పరిశీలించారు. అలాగే ఇస్కాన్ ద్వారా సరఫరా అవుతున్న భోజనాన్ని పరిశీలించారు. మనబడి నాడు-నేడు రెండో విడత పనులు, అనంత సంకల్పం అమలు, ప్రిన్సిపాల్ సెక్రెటరీ వీడియోలు చూస్తున్నారా? లేదా? అని, విద్యార్థుల హాజరు, తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఎపిఒ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపన

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైస్ ఎంపిపి ఎస్.తిరుపాలమ్మ, సర్పంచి ఆర్.గురుమస్తాన్, మాజీ జెడ్పిటిసి ప్రవీణ్ కుమార్ యాదవ్, వైసిపి నాయకులు ఎస్.రాము యాదవ్, సుధాకర్ యాదవ్, సురేష్ యాదవ్, వెంకట రాముడు యాదవ్ పాల్గొన్నారు.

'చింతమనేని'కి సన్మానం

శింగనమల : నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను శుక్రవారం స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువ రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, నాయకులు దాసరి గంగాధర్, బిసి సెల్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి అనంతనేనిచౌదరి, బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, అకులేడు పవన్, రంగస్వామి, దండు సతీష్‌రాయల్, తదితరులు పాల్గొన్నారు.



చింతమనేని ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దండు శ్రీనివాసులు

మధ్యాహ్న భోజనం పరిశీలన

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ యోగానందరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కూరలో నాణ్యత లేకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే మెనూ ప్రకారం ప్రతి విద్యార్థికీ భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్ ప్రసాద్, వీఆర్వో వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి వెల్ఫేర్ అసిస్టెంట్ గీత, మహిళా పోలీస్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

ఆత్మకూరు : మండల పరిధిలోని తలుపూరు గ్రామంలో వ్యవసాయ అధికారులు శుక్రవారం పంటకోత ప్రయోగం చేశారు. గ్రామానికి చెందిన రైతు చిన్న నారాయణమ్మ సాగు చేసిన వేరుశనగ పొలంలో పంటకోత ప్రయోగం చేయగా 9.2 కిలోల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఓబులేసు, ఎంపిటిసి ఓబులేసు, ఎఇఒ సుజిత, ఎంపిఇఒ భారతి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గాడితప్పిన పాలన

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని సి.బండమీదపల్లిలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో పారదర్శకత పూర్తిగా లోపించిందన్నారు. కేవలం సహజ వనరులు, ప్రజల సొమ్మును దోచుకుతినడానికే వైసిపి నాయకులు అధికారంలోకి వచ్చినట్లు ఉందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి మృగ్యమై అరాచకం రాజ్యమేలుతోందన్నారు. జగన్ దుష్ట పాలనపై మేథావులు సంధించే తొలి అస్త్రం ఎమ్మెల్సీ ఓటే కావాలన్నారు. అంతేగాకుండా గాడితప్పిన వ్యవస్థలను చక్కదిద్దే శక్తి ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎం.ఆదినారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి శివయాదవ్, వాణిజ్య విభాగం పార్లమెంట్ కార్యదర్శి డేరంగుల శంకరయ్య, లక్ష్మీనారాయణ, బాలముని, శ్రీరాములు, నాయకులు సి.వెంకటేష్, దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, తెలుగు యువత అధికార ప్రతినిధి బ్యాళ్ల సుదర్శన్, బిసి సెల్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, తెలుగు రైతు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి అనంతనేనిచౌదరి, నాగేశ్వర్‌రెడ్డి, మైనార్టీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి మహ్మద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'గవిమఠం' ఉత్సవాలు

ఉరవకొండ : ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి వసంతోత్సవంతో ఘనంగా ముగిశాయి. ముందుగా ఉత్తరాధికారి శ్రీకరిబసవ రాజేంద్రస్వాములు, సహాయ కమిషనర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రమౌళీశ్వరుడి ఉత్సవ విగ్రహాన్ని ఎదురు బసవన్న గుడి వరకు పల్లకిలో ఊరేగించారు. తర్వాత గవిమఠం ఆవరణలో ఉన్న బావి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల ప్రారంభ నాడు జరిపిన కంకణ ధారణ ముగింపు చేస్తూ (తొలగిస్తూ) గంగపూజ చేశారు. అనంతరం కంకణధారణ సమయం ఆచారం ప్రకారం వివిధ రకాల దినుసులు మట్టికుండల్లో వేసి ఉంటారు. ఈ మొలకలను మఠం బావిలోకి వదిలి బ్రహ్మోత్సవాలను ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రాజన్న గౌడ్, అర్చకులు విరుపాక్షయ్య, కిరణ్, రాజశేఖర్, వినాయక, మల్లికార్జున, రేవన సిద్ధయ్య, మఠం సిబ్బంది శంకర, గోపీ, నారాయణస్వామి, మధు, వెంకటేసులు, రఘురాములు, గణేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద భగత్‌సింగ్ కూడలిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి పేద, మధ్య తరగతి, సామాన్యులపై మోయలేని భారాన్ని విధించడం దుర్మార్గమన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.700, కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.వెయ్యి పెంచిందన్నారు. దీంతోపాటు పెట్రో ధరలు విపరీతంగా పెంచిందన్నారు. తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు కొనలేని పరిస్థితికి చేరుకున్నారన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ పట్టణ కార్యదర్శి చిన్నా, ఐఎఫ్‌టియు డివిజన్ కమిటీ అధ్యక్షులు శ్రీరాములు, పిఒడబ్ల్యు నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు సత్తార్, రామాంజి, గోపీ, కృష్ణ, గోపాల్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుహక్కుపై అవగాహన

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ఈనెల 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలనే అంశాలపై శుక్రవారం స్థానిక మున్సిపల్ బాలుర పాఠశాలలో తహశీల్దార్ బి.రాము ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ రవీంద్ర మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో ఓటింగ్‌కు, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ విధానానికి చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటుహక్కు వినియోగించుకుంటున్న వారికి గందరగోళంగా ఉంటుందన్నారు. ఈ గందరగోళంలో చేసే పొరపాటు ఓటు చెల్లానిదిగా మిగిలిపోతుందన్నారు. కావున ఆచితూచి ఓటే వేయాలన్నారు. ఇందులో మీకు నచ్చిన అభ్యర్థికి 1 సంఖ్యను సూచించాలన్నారు. మిగిలిన రెండు, మూడు ఇలా వరుసుగా అంకెలు వేసి ప్రాధాన్యత తెలియజేయాలని కోరారు. ఓటింగ్‌లో సంతకాలు చేయడం, పేర్లు రాయడం, ఇతర సంజ్ఞలతో సూచించరాదన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బండి శేషన్న, ఎంపిడిఒ జాషువా, ఎంఇఒ కుళ్లాయప్ప, పట్టభద్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : ఎమ్మెల్సీ ఎన్నికల ఓటుహక్కుపై శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, ఎంపిడిఒ తేజోష్ణ అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గురుప్రసాద్, ఇఒఆర్‌డి దామోదరమ్మ, ఏఎస్ఒ పోతిరెడ్డి, రీసోర్స్‌పర్సన్ హరిహరనాథ్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం : శాసనమండలి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగంపై శుక్రవారం రాయదుర్గంలోని మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మారుతి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఓటుహక్కు వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ వినియోగం, బ్యాలెట్ పేపర్ తిరస్కరణకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో స్వీప్ యాక్టివిటీస్ కమిటీ హెడ్ ఈశ్వర్, ఎంసిసి ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఒ గోపీనాథ్, సచివాలయ ఉద్యోగులు, ఓటర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ట్రైనర్లు, ఇఒఆర్‌డి రఘురాంరావు, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



క్రీడాకారునికి ట్రోఫీ అందజేస్తున్న అతిథులు


ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ టోర్నమెంట్ విజేత శ్రీచైతన్య జట్టు

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఫాదర్ విన్సెంట్ క్రికెట్ టోర్నమెంట్‌లో తాడిపత్రి శ్రీచైతన్య టెక్నో స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. వారంరోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 16 పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీలో నారాయణ స్కూల్, చైతన్య స్కూల్ జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచిన నారాయణ స్కూలు జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన చైతన్య పాఠశాల జట్టు 15 ఓవర్లలో 97 పరుగులు చేసి మూడు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ తమీం 49 పరుగులు చేశాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నారాయణ స్కూల్ జట్టు 15 ఓవర్లలో 87 పరుగులకు 8 వికెట్లు కోల్పోయింది. మ్యాచ్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. టోర్నమెంట్‌లో బెస్ట్ ప్లేయర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ తమీంను వరించింది. బెస్ట్ వికెట్ కీపర్ చరణ్, బెస్ట్ బౌలర్ భాను శ్రవంత్‌రెడ్డి ఎంపికయ్యారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి, టిసిఎ సెక్రటరీ సాదక్‌వలి, డిగ్రీ కళాశాల పిఇటి జయలక్ష్మి, చైతన్య నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ అమర్నాథ్‌రెడ్డి, బాబు, క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : ఎస్పీ

అనంతపురం : ప్రజలకు మెరుగైన సేవలందించి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి సూచించారు. శుక్రవారం ఏఆర్ టు సివిల్ కన్వర్షన్ అయిన ముగ్గురు కానిస్టేబుళ్లు ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉండే పోలీసులు ప్రజలకు నిజాయితీగా సేవలందించి మన్ననలు పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, కన్వర్షన్ అయిన కానిస్టేబుళ్లు వెంకటరాముడు, మనోహర్, పూజారి మనోహర్ పాల్గొన్నారు.



ఎస్పీకి బొకే అందజేస్తున్న కానిస్టేబుళ్లు

బిటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.టెక్ 3వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, బీ.టెక్ 3వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష పలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యు యేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్షా పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.in ను సంప్రదించాలని తెలిపారు.

సచివాలయాల తనిఖీ

నార్పల : నార్పల-2, బొందలవాడ సచివాలయాలను డివిజినల్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారిణి ఓబుళమ్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. అలాగే సిబ్బంది బయోమెట్రిక్ హాజరు శాత, స్పందన కార్యక్రమంపై ఆరాతీశారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేయకపోయినా, యూనిఫాం ధరించకపోయినా, స్పందన కార్యక్రమంలో పాల్గొనకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.